# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :120 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 12-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## బలూచీలో 9మంది ప్రయాణికుల కాల్చివేత

లాహోర్,జూలై11: బస్సులో ప్రయాణిస్తున్న వారిలో తొమ్మిది మందిని కిందకు దించి దారుణంగా కాల్చి చంపారు. ఈ సంఘటన పాకిస్తాన్‌లోని అల్లకల్లోల బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ప్రావిన్స్‌లోని జోబ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రయాణీకుల బస్సు నుండి పంజాబ్‌కు చెందిన తొమ్మిది మంది ప్రయాణికులను దింపి.. తిరుగుబాటు-దారులు కాల్చి చంపారని అసిస్టెంట్ కమిషనర్ జోబ్ నవీద్ ఆలం తెలిపారు. క్వెట్టా నుండి లాహోర్‌కు వెళ్తున్న బస్సును ఆపి ప్రయాణికుల ఐడి కార్డులను తనిఖీ చేసి.. వారిలో తొమ్మిది మందిని కిందకు దింపి కాల్చి చంపారు. మృతులు పంజాబ్ ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తింపు. తొమ్మిది మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారని ఆయన అన్నారు.

## మాటలు అందరూ చెప్పారు.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి..!



ఖమ్మం:ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిను ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవి అని రేణుకా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని తెలిపారు. ఎవరెవరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42% బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## భారత్ నష్ట పోయినట్లు ఒక్క ఫొటో చూపించండి..



చెన్నై:చెన్నైలో జరిగిన ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని అజిత్ దోవల్ వివరించారు. భారతదేశం నష్టాన్ని చూపించే ఒక్క చిత్రాన్ని అయినా తనకు చూపించాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పలు విదేశీ మీడియా సంస్థలు పాకిస్థాన్ భారత్‌లోని పలు ప్రాంతాలను ధ్వంసం చేశాయని కథనాలు రాశాయి. ఈ అంశంపై తాజాగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్పందించారు. ఆపరేషన్ సిందూర్ గురించి అజిత్ దోవల్ మాట్లాడుతూ.. "ఆపరేషన్ సిందూర్‌కు 23 నిమిషాలు పట్టింది. పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయాలని మేము నిర్ణయించుకున్నాం. ఆపరేషన్ సిందూర్ పట్ల గర్విస్తున్నాం. ఆ నిర్ణీత 9 లక్ష్యాలపై తప్ప మరెక్కడా దాడి చేయలేదు. దాడులు ఖచ్చితమైనవి. బ్రహ్మోస్, రాడార్ లాంటి స్వదేశీ ఆయుధాలతో దాడులు జరిపాం." అని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుడు నివేదికలు ఇచ్చిన విదేశీ మీడియాపై అజిత్ దోవల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ దాడులు చేసిందని విదేశీ మీడియా చెప్పింది. భారత్‌లో ఏదైనా భవనానికి నష్టం వాటిల్లినట్లు చూపించే ఒక్క ఫోటోను నాకు చూపించండి అని ప్రశ్నించారు. మన దేశంలో ఒక్క గాజు ముక్క కూడా పగిలిపోలేదు. విదేశీ మీడియాలు తప్పుడు నివేదికలు ఇచ్చాయని మండిపడ్డారు. సర్గోధ, చక్లాలా, రహీమ్ యార్ ఖాన్ సహా 13 పాకిస్థాన్ వైమానిక స్థావరాల ముందు, తరువాత ఉపగ్రహ చిత్రాలను ఆయన చూయించారు. పాకిస్థాన్ తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ ఆపరేషన్ లో స్వదేశీ సామర్థ్యాన్ని హైలైట్ చేశారు.

## 'మోదీజీ.. అలాంటి దేశాలకు వెళ్లడమెందుకు?..



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సెటైరికల్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీ.. ఏయే దేశాలకు వెళ్తున్నారో ఆ దేవుడికే తెలియాలి. కేవలం పది వేల మంది జనాభా ఉన్న దేశాల్లో మోదీ పర్యటించం ఏంటి? అని మాన్ విమర్శించారు. ఈ క్రమంలో సీఎం మాన్ వ్యాఖ్యలపై భారత విదేశాంగశాఖ మండిపడింది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా పూర్తిగా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించింది. ఇటీవల ప్రధాని మోదీ.. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆయన ఆయా దేశాల పార్లమెంట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ పర్యటనలపై తాజాగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందించారు. ఓ కార్యక్రమంలో సీఎం మాన్ మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ.. చిన్న చిన్న దేశాలకు సైతం వెళ్తున్నారు. ఘనా అని ఎక్కడికో వెళ్లారు. స్వదేశానికి తిరిగివస్తున్న ఆయనకు స్వాగతం. ప్రధాని ఏయే దేశాలకు వెళ్తున్నారో ఆ దేవుడికే తెలియాలి. 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో మన ప్రధాని ఉండరు. కానీ, పది వేల మంది జనాభా ఉన్న దేశాలను మాత్రం సందర్శిస్తున్నారు. అక్కడ ఆయనకు అత్యున్నత అవార్డులు కూడా అందుతున్నాయి' అని వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం మాన్ వ్యాఖ్యలపై భారత విదేశాంగశాఖ మండిపడింది. ప్రధాని విదేశీ పర్యటనలపై రాష్ట్రంలోని ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు తమ దృష్టికి వచ్చాయని మాన్ పేరును ప్రస్తావించకుండా పేర్కొంది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని తెలిపింది. ఈ వ్యాఖ్యలు వారి స్థాయిని తగ్గించేవని మండిపడింది. భారత్‌తో స్నేహపూర్వకంగా మెలిగే దేశాలను తక్కువ చేసి మాట్లాడటం సబబు కాదని పేర్కొంది.

కాంగ్రెస్ కౌంటర్..

మరోవైపు.. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ నేతలు సైతం విమర్శిస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్.. ప్రధాని మరో విదేశీ పర్యటనకు వెళ్లేలోపు ఓ మూడు వారాలు మన దేశంలో ఉంటారేమో! ఇప్పుడైనా మణిపూర్ వెళ్లడానికి ఆయనకు తీరిక దొరుకుతుందో, లేదో అని ఆయన ఎద్దేవా చేశారు. ఇక, మణిపూర్ విషయమై.. ఇప్పటికే కాంగ్రెస్.. మోదీపై విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.

## టిటిడిలో అన్యమత ఉద్యోగులను తొలగించాలి



తిరుమల,జూలై11, టీటీడీలో 1000 మందికి పైగా అన్యమతస్థులు పని చేస్తున్నారని వారిని వెంటనే తొలగించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసుడిని కేంద్రమంత్రి బండి సంజయ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని అన్నారు. వారికి హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేదన్నారు. టీటీడీ పాలకమండలి వెంటనే స్పందించి వారందరినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన కేంద్రమంత్రి.. ఒకరిని తొలగిస్తే సరిపోదని, ఇక్కడ పనిచేస్తున్న అన్యమత ఉద్యోగస్థులందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యమస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోపాటు- పురాతన ఆలయాలను టీటీడీ అభివృద్ధి చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టీటీడీ సహకారం అందించాలని కేంద్రమంత్రి కోరారు. శ్రీవారి సేవలో నిజమైన భక్తి, నిబద్ధతతో పనిచేసే వారికే అవకాశం కల్పించాలంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## మరోమారు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్ రావు



హైదరాబాద్,జూలై11: కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఈ వివరాలన్నీ డాక్యుమెంట్లతో సహా కమిషన్‌కు ఇచ్చానని చెప్పుకొచ్చారు. మిగిలిన వివరాలు రేవంత్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని వివరించారు. కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు. సెక్షన్ 3 కింద నీళ్లు పంపిణీ చేయాలని అప్పుడే అడిగారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు...కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానం, అహంకారం బయటపెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని దెప్పిపొడిచారు. 299 టీ-ఎంసీల పేరుతో శాశత్వ ఒప్పందమని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీ-ఎంసీలకి ఉమ్మడి రాష్ట్రంలో ఒప్పందం చేశారని గుర్తుచేశారు. శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే...సెక్షన్ 3 కోసం పోరాటం ఎందుకు చేస్తారని నిలదీశారు. సెక్షన్-3 విషయంలో ఉమా భారతి, గడ్కరీనీ కలిశారని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి హరీష్‌రావు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సెక్షన్-3ని కేసీఆర్ సాధించారని మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్ఘాటించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం ఒప్పందం చేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సైతం 299 టీఎంసీలకు సంతకాలు చేశారని మరి మీరు ఎలా చేశారని ప్రశ్నించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను రేవంత్ ప్రభుత్వం సాధించాలని కోరారు. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని.. తాను చాలా బాధతో చెబుతున్నానని అన్నారు. కృష్ణానదిని దోచుకో అని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని తాను బయటపెట్టిన తర్వాత ఆయన మాట మార్చారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాగూ తెలియదు... ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలీదు అంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. 573 టీ-ఎంసీలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానమని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. 00 ఏళ్ల కింద కాకతీయులు, నిజాం కాలంలో కట్టిన ప్రాజెక్ట్‌లని రేవంత్‌రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. దేశానికి స్వాతంత్రం రాకముందు కట్టిన ప్రాజెక్ట్‌లను కూడా ఆయన ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ 6లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే...బీఆర్ఎస్ పాలనలో 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. తుమ్మడిహెట్టి నుంచి బ్యారేజ్ మార్పుపై సీఎం రేవంత్‌రెడ్డి కేందప్రభుత్వాన్ని తప్పుబడుతున్నారు. కేంద్రం ఎందుకు అనుమతి ఇచ్చిందో ప్రశ్నించండి. 160 టీ-ఎంసీలకు కేంద్రం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అనుమతి తేలేదు?. అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం. మా మైక్ కట్ చేయకుండా, అసెంబ్లీ నుంచి పారిపోవద్దు. రేవంత్ 20 నెలల పాలనలో ఇప్పుడు ఒక్క చెరువు, చెక్ డ్యామ్ అయినా కట్టించారా.?. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయనిది నీళ్లు ఎలా వచ్చాయి.. పంటలు ఎలా పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను వాడటం లేదు... 6శాతం నీళ్లను తక్కువగా వాడారని హరీష్‌రావు విమర్శించారు.

## బీసీలను మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి...



మహబూబాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ ద్వారా కల్పిస్తామని మరో మారు సీఎం రేవంత్ రెడ్డి బీసీ ప్రజానీకాన్ని మోసం చేయడం జరుగుతుందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ గర్జన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సత్యవతి రాథోడ్ ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని అనేకసార్లు మాయ మాటలు చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. మళ్లీ క్యాబినెట్ సమావేశంలో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి బీసీలను భ్రమలో పడేసి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలలో యువత ముఖ్యపాత్ర వహించాలని గ్రామాలలో, తండాలలో యువత ఓటర్లను చైతన్యం చేయాలని సూచించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల వల్ల గ్రామాలు నిరుపేద ప్రజలు అభివృద్ధి చెందారని ఆ సంక్షేమ కార్యక్రమాలను తండాలలో యువత విస్తృతంగా ప్రచారం చేసి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయిని రంజిత్, సునావత్ అశోక్ నాయక్, మురళీధర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు ల్యాబ్ ఉద్యోగుల లైంగిక వేధింపులు

అమరావతి, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపింది.. బయో కెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, మైక్రో బయాలజీ టెక్నీషియన్ జిమ్మీ రాజు, బయో కెమిస్ట్రీ ఎల్ టీ గోపాలకృష్ణ, పాథాలజీ ఎల్‌టీ ప్రసాద్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు.. మెయిల్ ద్వారా ఒకేసారి 50 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు.. అయితే, ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్‌లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను నివేదిక కోరారు.. దీంతో, సీఎంకు నివేదిక అందించారు వైద్యఆరోగ్య శాఖ అధికారులు. దీనిపై స్పందించిన సీఎం.. నిందితులపై కఠిన చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.. మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి అనే ఉద్యోగిపై ఈనెల 9వ తేదీన విద్యార్థినిలు ఫిర్యాదు చేశారు..

## లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు : సీపీ సీవీ ఆనంద్



చార్మినార్, జూలై 11 : బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తగిన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. శుక్రవారం సీపీ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్‌తో కలిసి లాల్ దర్వాజా సింహవాహిని ఆలయ శిఖర పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రతినిధులు అధికారులకు సాదర స్వాగతం పలికి శిఖర, ధ్వజారోహణ పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగాసీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం హైదరాబాద్ నగర కొత్వాల్‌ను శిఖరపూజ, ధ్వజారోహణ కార్యక్రమాలకు ఆహ్వానించడం ఆలయ కమిటీకి ఆనవాయితీగ వస్తుందన్నారు. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం ఎంతో చరిత్ర కలిగిన ఆలయం. 1908 సంవత్సరంలో భారీ వర్షాల కారణంగా నగరంలో మూసీ నదిలో వరదలు భారీగా పెరిగిపోయాయి. ప్లేగు వ్యాధితోపాటు అంటు వ్యాధులు సైతం పెరుగుతూ 50 వేల మంది ప్రాణాలని బలిగొన్నాయి. పరిస్థితి చేయి దాటిపోతున్న తరుణంలో నాటి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆ తర్వాత మూసీ నదిలో వరదలు, వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. అప్పటి నుండి ఆషాఢమాసంలో బోనాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. సుమారు 120 సంవత్సరాలుగా అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఇక్కడ బోనాల పండుగలు నిర్వహిస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. ఆలయ కమిటీ వారు అందరి సమన్వయంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తరఫున పోలీస్ శాఖ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు చేసిందని సీపీ తెలిపారు. అన్ని శాఖలతో సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టామని, హైదరాబాద్ సౌత్ జోన్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారని, అదనంగా బయట నుండి పోలీస్ సిబ్బందిని రప్పిస్తున్నామని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ కోరారు. పోలీస్ తరపున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని, బోనాల సందర్భంగా జేబు దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ఈవ్ టీజింగ్ వంటివి జరగకుండా క్రైమ్ విభాగం పోలీసులతో, షీ టీమ్ బృందాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, కె. అపూర్వ రావు, డీసీపీ స్నేహ మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ ఆర్. వెంకటేశ్వర్లుతో పాటు ఇతర అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ బి. మారుతీ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

**శనివారం 12-07-2025**

# కొత్త దారుల్లో పర్యాటకం

ఆదిమానవుడి సంచార జీవనం మొదలు... నేడు విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వరకు పర్యటన అనేది మనిషి జీవితంలో అంతర్భాగమైపోయింది. కొంతకాలంగా ఈ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాటిని అందిపుచ్చుకోగలిగితే భారత్ మరింత మంది పర్యాటకులను ఆకట్టుకోగలుగుతుంది. తద్వారా ప్రభుత్వాదాయం పెరగడంతోపాటు కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ అందుబాటులోకి వస్తాయి. దేశీయ పర్యాటక రంగంలో చాలాకాలం పాటు ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాలను చూడటం, ప్రకృతి లోగిళ్లకు వెళ్లిరావడమే ఎక్కువగా ఉండేది. ఇటీవలి సంవత్సరాల్లో చదువు, క్రీడలు, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం కోసం ఇతర ప్రాంతాలు, విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువవుతోంది. ఇప్పుడు చాలా దేశాలకు పర్యాటక రంగం ద్వారా సమకూరే ఆదాయమే అత్యంత కీలకమవుతోంది. విదేశీ యాత్రికులను ఆకట్టుకోవడం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు సాధించాలనీ, తద్వారా ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలూ మెరుగుపడతాయని అన్ని దేశాలూ భావిస్తున్నాయి. అందుకోసమే పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నాయి. ఇవాళ ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్లిరావడం చాలా సులభమైపోయింది. ఆధునిక సాంకేతికతలు, సమాచార సాధనాలు అందివచ్చాయి. దాంతో ప్రపంచం కుగ్రామంలా మారిపోయింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, వాటి ప్రత్యేకతలు, ఆహార అలవాట్ల గురించి ప్రజలు తెలుసుకుంటున్నారు. నచ్చిన చోటుకు ఒంటరిగానో, స్నేహితులూ కుటుంబ సభ్యులతోనో కలిసి వెళ్లొస్తున్నారు.

మహమ్మారి తరవాత...

ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి సృష్టించిన బీభత్సం అంతాఇంతా కాదు. లాక్‌డౌన్లు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అనేకమంది నెలల తరబడి ఇళ్లకే పరిమితమైపోయారు. మహమ్మారి నెమ్మదించడంతో ప్రజల్లో 'ప్రతీకార పర్యాటకం' అనే ధోరణి బలంగా వచ్చింది. అంటే, ఉన్నంతలో ప్రపంచాన్ని చూసి తరించాలనే మానసిక భావన పెరిగింది. అందువల్లే, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య కరోనా ముందు కంటే ఆ తరవాత 15 రెట్లు దాటిందని నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే పర్యాటక రంగంలో కొత్త ధోరణులు కనిపిస్తున్నాయి. సాధారణంగా యాత్రికులు ఉదయమంతా వివిధ ప్రాంతాల్లో పర్యటించి, రాత్రి ఏ హోటల్ గదిలోనో విశ్రాంతి తీసుకోవడం పరిపాటి. అయితే, ఇటీవల చాలామంది వెన్నెల రాత్రిలో అటవీ ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేయడం, వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్లడం, సముద్ర తీరాల్లో పడవల్లో విహరించడం వంటివి చేస్తున్నారు. నైట్ సఫారీ పేరిట అభయారణ్యాల్లో పర్యటించి చీకట్లో సంచరించే జంతువులను చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. సెలయేళ్ల పక్కన, ఎడారి ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని క్యాంప్ ఫైర్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. సాహస యాత్రికులు ఎక్కువగా రాత్రి పర్యాటకంపై ఆసక్తి చూపుతున్నారు.

విదేశీ అతిథుల పెళ్లి సందడి

ఇక ప్రపంచవ్యాప్తంగా సంస్కృతీ సంప్రదాయాలు, వివాహ రీతులను తెలుసుకునే విదేశీ పర్యాటకులూ చాలామందే ఉన్నారు. ముఖ్యంగా కుటుంబ జీవనానికి అధిక ప్రాధాన్యమిచ్చే భారతీయ వివాహాలు యూరోపియన్లు, అమెరికన్లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. అందుకు సంబంధించిన పుస్తకాలతో పాటు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉండే సమాచారాన్ని చదువుతున్నారు. తమ దేశాల్లో నివసించే ప్రవాస భారతీయుల సాయంతో ఇక్కడికి వచ్చి, గ్రామాల్లో జరిగే వివాహ వేడుకలను నేరుగా తిలకిస్తున్నారు. ఇందుకోసం కొన్ని సంస్థలు వెడ్డింగ్ టూరిజం పేరుతో సేవలు అందిస్తున్నాయి. తమ వెబ్‌సైట్లలో నమోదు చేసుకున్న విదేశీయులు ఇండియాకు రాగానే కుర్తా పైజామా, చీరలు వంటి భారతీయ సంప్రదాయ దుస్తులను అందిస్తున్నారు. పెళ్లి బృందంతో కలిసి వారు సంగీత్, హల్దీ వంటి వేడుకల్లో పాల్గొనేందుకు వధూవరుల కుటుంబాలను ఒప్పిస్తున్నారు. ఇందుకోసం విదేశీయుల నుంచి కొంత రుసుము వసూలు చేస్తున్నారు. ఇది నూతన వధూవరులకు కొంత ఆర్థిక తోడ్పాటుగా ఉంటుంది. అమెరికా, ఐరోపా సమాజాల్లో జనాభా తక్కువ. అధునాతన మౌలిక వసతులు, పరిశుభ్రమైన పరిసరాలు ఉంటాయి. వాటికి భిన్నంగా, కిక్కిరిసిన మురికివాడల్లో జీవించే ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి విదేశీ విద్యార్థులు, ఆర్థిక నిపుణులు గతంలో మురికివాడలకు వచ్చేవారు. అయితే, 2008లో 'స్లమ్ డాగ్ మిలియనీర్' సినిమా సంచలనం సృష్టించి ఆస్కార్ అవార్డులను గెలుచుకున్న తరవాత 'స్లమ్ టూరిజం' వ్యాప్తిలోకి వచ్చింది. మురికివాడల్లో జీవన పరిస్థితులను తెలుసుకోవడానికి చాలామంది విదేశీ యాత్రికులు ఆసక్తి చూపుతున్నారు. ఆసియాలోనే అతిపెద్ద మురికివాడగా పేరుగాంచిన మహారాష్ట్రలోని ధారావీకి పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు వస్తుండటమే ఇందుకు నిదర్శనం.

అవకాశాలను అందిపుచ్చుకుంటే...

ప్రఖ్యాత గాయనీగాయకులు, కళాకారులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాల్, ఏఆర్ రెహమాన్ వంటి వారెందరో విదేశీ నగరాల్లో ప్రదర్శనలిచ్చారు. ఇటీవల కోల్డ్ ప్లే, ఎడ్ షీరన్ వంటి కళాకారులు ఇండియాలో పర్యటించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులు స్థానిక హోటళ్లలో బసచేసి, చుట్టుపక్కల ప్రదేశాల్లో పర్యటిస్తుంటారు. అక్కడ లభించే ఆహారాన్ని రుచి చూసి, వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. దీనివల్ల స్థానికులతో పాటు ప్రభుత్వానికీ ఆదాయం సమకూరుతుంది. టేలర్ స్విఫ్ట్ అనే ప్రముఖ పాప్ గాయని ప్రపంచంలో ఏ నగరంలో కచేరీ ఏర్పాటు చేసినా, అక్కడి స్థానిక ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆర్థికవేత్తలు గుర్తించారు. ఈ పరిణామాన్ని వారు 'స్విఫ్ట్‌నామిక్స్'గా చెబుతుంటారు.

# నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి !



అమరావతి/హైదరాబాద్,ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగించారు. తాజాగా బనకచర్ల పేరుతో పంచాయితీ మొదలయ్యింది. ఇలా ఎవరిక వారు కాకుండా, కలసి నదీజలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాలు చర్చించాలి. ఉమ్మడి ప్రయోజనాలు ఆశించాలి. పరస్పర నిందలతో లాభం లేదని గుర్తించాలి కృష్ణ, గోదావరిల నుంచిచుక్కనీరు సముద్రంలో కలవకుండా చూసుకోవాలి. అంతేత్ప రాజకీయప్రయోజనాల కోసం పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం తగదు. ఇది వాంఛనీయం కూడా కాదు. ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. విపక్షాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పరిస్థితి రాకుండా చూడాలి. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి,నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్దతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శతృవుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఏపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

# భాజపా వ్యూహాత్మక అడుగులు...



అమరావతి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచీ నేటి నవ్యాంధ్ర వరకు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ప్రస్థానం ఎన్నో ఎత్తుపల్లాలు చూసింది. 2024 ఎన్నికల తరవాత రాష్ట్రంలో ఆ పార్టీ వేస్తున్న ప్రతి అడుగులోనూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు రాబట్టగల స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. తాజాగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియామకం ద్వారా సంస్థాగత నిర్మాణంపై భాజపా దృష్టి సారించింది.ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ బలాన్నీ, దాని ముందున్న సవాళ్లనూ అర్థం చేసుకోవాలంటే- కూటమితో ఉన్నప్పుడు, ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఆ పార్టీకి లభించిన ఓట్ల శాతాలను విశ్లేషించడం ముఖ్యం. రాష్ట్ర విభజనకు ముందు, 1983 శాసనసభ ఎన్నికల్లో భాజపా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో కాషాయపార్టీ 2.76శాతం ఓట్లతో మూడు స్థానాలు గెలుచుకుంది. తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్న 1999 ఎలక్షన్లలో భాజపా పనితీరు గణనీయంగా మెరుగుపడింది. నాడు 12 శాసనసభ స్థానాలు(3.67% ఓట్లు), ఏడు లోక్‌సభ స్థానాలు(9.91% ఓట్లు) సాధించి రికార్డు సృష్టించింది. కానీ, ఆ తరవాత దాని రాజకీయ గ్రాఫ్ క్రమంగా తగ్గుముఖం పట్టింది. రాష్ట్ర విభజన అనంతరం, 2014 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వీచిన మోదీ ప్రభంజనం, తెదేపా, జనసేనలతో పొత్తు భాజపాకు బాగా కలిసొచ్చింది. అప్పుడు నాలుగు శాసనసభ స్థానాలు(2.2% ఓట్లు), రెండు లోక్‌సభ స్థానాలు(7.22% ఓట్లు) గెలుచుకుని రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది.

పాఠం నేర్పిన ఓటమి

2019 ఎన్నికలు భాజపాకి అత్యంత గడ్డు కాలాన్ని మిగిల్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో తలెత్తిన విభేదాలతో తెదేపా దూరం కావడంతో ఒంటరిగా పోటీ చేసిన భాజపా ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఒక్క శాసనసభ స్థానాన్ని కూడా గెలవలేకపోగా, కేవలం 0.84శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన 173 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. లోక్‌సభ స్థానాల్లోనూ ఖాతా తెరవలేకపోయింది. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కలిపి 0.98 శాతం ఓట్లే తెచ్చుకోగలిగింది. ఈ ఫలితంతో- ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ మనుగడకు మిత్రపక్షాల మద్దతు ఎంత కీలకమో స్పష్టంగా తెలియవచ్చి ంది.దాంతో, 2024 ఎన్నికలకు వచ్చేసరికి భాజపా అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె, చంద్రబాబు నాయుడి వదిన అయిన దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా నియమించింది. తద్వారా తెదేపాతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు అనువైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. అంతర్గతంగా ఆమె అనుసరించిన వ్యూహాత్మక సమన్వయం- పార్టీలోని భిన్న వర్గాల విధేయతలను తిరిగి భాజపా వైపు మళ్లించడానికి దోహదపడింది. తెదేపా-జనసేనల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటు చర్చల్లో పురందేశ్వరి వ్యవహారశైలి కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహాత్మక ఎత్తుగడల ఫలితంగా 'కూటమి' భాగస్వామ్యంతో 2024 ఎన్నికల్లో భాజపా అద్భుతమైన పునరాగమనం చేసింది. ఎనిమిది శాసనసభ స్థానాలు గెలుచుకుంది. అలాగే, ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి మూడింటిని కైవసం చేసుకుంది. శాసనసభ స్థానాల్లో 2.83శాతం, లోక్‌సభ స్థానాల్లో 11.28శాతం ఓట్లు సాధించింది.

సైద్ధాంతిక క్షేత్రంలో పోటీ

ప్రస్తుతం భాజపా ఒకేసారి రెండు లక్ష్యాలతో ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. స్వల్పకాలిక మనుగడ కోసం కూటమిలో కొనసాగుతూనే, దీర్ఘకాలంలో సొంతంగా బలపడటానికి పునాదులు వేసుకుంటోంది. ఇందులో భాగంగానే, లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికైన పురందేశ్వరి స్థానంలో- ఎలాంటి ఆర్భాటాలూ లేని, సంస్థాగత నిర్మాణంపై మంచి పట్టున్న పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడయ్యేలా అధిష్ఠానం పావులు కదిపింది. ఆయన తప్ప మరెవరూ అధ్యక్ష స్థానం కోసం తలపడలేదు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా, మాజీ ఎమ్మెల్సీగా, ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన దివంగత చలపతిరావు కుమారుడిగా మాధవ్‌కు బలమైన నేపథ్యమే ఉంది. ఆయన నిబద్ధత, నిరాడంబర వ్యక్తిత్వం సంస్థాగత నిర్మాణంలో పార్టీకి కలిసి వస్తాయని అధిష్ఠానం విశ్వసిస్తోంది. అయితే, కొత్త అధ్యక్షుడి ముందున్న మార్గం అంత సులభమైనదేమీ కాదు. భాజపా జాతీయ అజెండాలోని 'వికాస్ (అభివృద్ధి)' నినాదాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సీఈవో ఇమేజ్‌తో సొంతం చేసుకున్నారు. రాజధాని అమరావతి వంటి బృహత్ ప్రాజెక్టులతో ఆయన అభివృద్ధి ఎజెండాను నడిపిస్తున్నారు. మరోవైపు, హిందుత్వ సైద్ధాంతిక క్షేత్రంలో- ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ 'సనాతన ధర్మ పరిరక్షకుడి'గా తనను తాను నిలబెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితులు రాష్ట్రంలో భాజపాను ఒక రకంగా నిష్క్రియాత్మక పాత్రలోకి నెడుతున్నాయి. కూటమిలోని బలమైన భాగస్వామి అయిన తెదేపాను ఇబ్బంది పెట్టకుండా, తన సొంత అజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేని స్థితిలో ఆ పార్టీ ఉంది. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కాషాయ పార్టీకి ప్రత్యేక గుర్తింపునిచ్చే ప్రధాన సైద్ధాంతిక అంశాలను, ఏపీలో దాని మిత్రపక్షాలే బలంగా ఆక్రమించాయి.

నెమ్మదిగా విస్తరించడానికి...

భాజపా వ్యూహం 'సైద్ధాంతిక పరిచయం' (ఐడియలాజికల్ ఫెమిలరైజేషన్) అనే సహనంతో కూడిన పంథాలో సాగుతున్నట్లే కనిపిస్తోంది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉంటూనే రాష్ట్రంలో తన ఉనికిని క్రమంగా విస్తరించుకుంటోంది. విశాఖపట్నంలో జరిగిన యోగా దినోత్సవం వంటి కార్యక్రమాలను- పార్టీ సాంస్కృతిక జాతీయవాదాన్ని తెలుగు ప్రజల చైతన్యంలోకి నెమ్మదిగా చొప్పించడానికి చేస్తున్న 'సాఫ్ట్ పవర్' ఎత్తుగడలుగా చూడవచ్చు. భాజపా అధిష్ఠానం తన మిత్రపక్షాలను ముందుంచి, తక్షణ ఆధిపత్యం కంటే క్రమమైన ప్రజామోదం, సంస్థాగత విస్తరణపైనే దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. పాపులర్, మాస్‌లీడర్ కంటే... మాధవ్ వంటి పూర్తిస్థాయి సంస్థాగత నాయకుడే క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణానికి మరింత సమర్థంగా పనిచేయగలరనే అధిష్ఠానం నమ్మకం వెనక అంతరార్థమిదే!

# పురోగతిలో అమెరికాతో వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ,అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు- కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి.తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఒప్పందం యొక్క మొదటి దశను సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగించడానికి లక్ష్యంగా పెట్టు- కున్నట్లు- చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు 26 దేశాలతో 14కి పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలు చేసిందని అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్కెట్లతో అనుసంధానం అవుతున్నామని.. ఇప్పటికే యూకేతో ఒక ఒప్పందాన్ని ముగించినట్లు- పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో కూడా చర్చల దశలో ఉన్నట్లు- తెలిపారు.ఇక భారతదేశం.. చిలీ, పెరూ వంటి లాటిన్ అమెరికన్ దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నట్లు- చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియా, యూఏఈలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయని.. న్యూజిలాండ్‌తో కూడా చర్చలు జరుపుతున్నట్లు- వెల్లడించారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పెద్ద ఎత్తున ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు- ఆయన చెప్పుకొచ్చారు. ప్రిల 2న ట్రంప్.. ఆయా దేశాలపై సుంకాలు విధించారు. అయితే ఆయా దేశాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో ఈ నిర్ణయాన్ని మూడు నెలల పాటు- తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఆ డెడ్‌లైన్ మొన్న జూలై 9తో ముగిసింది. ఈ మేరకు ఆయా దేశాలను హెచ్చరిస్తూ లేఖలు కూడా రాశారు. ఇక రెండు మిత్ర దేశాలకు ఇప్పటికే సుంకాలు విధించారు. మిగతా దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు విధించారు. ఈలోపు అమెరికాతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమెరితో యూకే, వియత్నాం మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయి. చైనా మాత్రం పరస్పరం తాత్కాలింగా తగ్గించుకోవాలని నిర్ణయం తీసుకున్నాయి.

# మార్కులు తక్కువొచ్చాయని ఆవేదన వద్దు

పుట్టపర్తి,గురుపౌర్ణమి నాడు పుట్టపర్తిలో మెగా పీటీఎమ్ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని.. బడి గేటు బయటనే పాలిటిక్స్ అని చెప్పుకొచ్చారు. ఒక్క మార్కు తక్కువ వస్తే విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారని... ఇలా చేయడం తప్పని.. పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. సవాళ్లు ఎదుర్కోవడం అంటే తనకు ఇష్టమన్నారు. విద్యాశాఖలో లీప్ యాప్ తీసుకొచ్చామని.. దీన్ని పేరెంట్స్ అందరూ డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఉండే పిల్లల వివరాలు, విద్యా ప్రమాణాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వానికి సూచనలు కూడా చేయవచ్చన్నారు. డ్రగ్స్ వల్ల క్యాన్సర్ వస్తుందని... అందుకే డ్రగ్స్ వద్దు బ్రో అని పిలుపునిచ్చారు. అమ్మంటే రెండు అక్షరాలు కాదని.. అమ్మను గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను విద్యాశాఖ మంత్రి అవగానే ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. పిల్లలు ఇంటికి వచ్చాక చదువుపై పేరెంట్స్ బాధ్యతగా ఉండాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారని.. విద్యాశాఖ ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటుతామని వెల్లడించారు. ప్రతి మొక్కకు గ్రీన్ పాస్ పోస్ట్ ఇస్తున్నామని తెలిపారు. గ్రీన్ పాస్ పోస్ట్ ద్వారా మొక్క పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. 2019లో మంగళగిరిలో ఓడిపోయానని... కానీ కసితో కష్టపడి 2024లో భారీ మెజార్టీతో విజయం సాధించానని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఓ యువతిపై జరిగిన సంఘటన తనను కలచి వేసిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో శ్రీ సత్యసాయి జిల్లాకు మురళీ నాయక్ మృతి చెందారని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

## మల్నాడు డ్రగ్ పార్టీ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్,మల్నాడు రెస్టారెంట్ డ్రగ్ పార్టీ కేసులో ఈగిల్ టీమ్ దర్యాప్తును ముమ్మరం చేసింది. 9 పబ్స్ పైన ఈగల్ కేసులు నమోదు చేసింది. ఇప్పటికే, పబ్బుల యజమానులకు నోటీసులు జారీ చేసింది. వచ్చే వారం తమ ఎదుట హాజరు కావాలని పబ్బు యజమానులకు నోటీసులు అందజేశారు. మల్నాడు రెస్టారెంట్ సూర్యతో ముగ్గురు పబ్ యజమానులతో సంబంధాలు ఉన్నట్లు- సమాచారం. మూడు పబ్స్ యజమాలతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా ఈగల్ టీమ్ గుర్తించింది. అయితే, పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్, బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్స్ కు చెందిన యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అయితే, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ పబ్ రాజా శేఖర, కోరా పబ్ పృధ్వీ వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు- తెలిపారు. ఈ ముగ్గురు పబ్బు యజమానులతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు- సూర్య పేర్కొన్నారు.

## తుంగభద్రకు తగ్గిన ఇన్‌ఫ్లో

కర్నూలు,తుంగభ జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో 8 క్రస్ట్‌గేట్లు క్రిందకు దించి కేవలం 13క్రస్ట్‌గేట్ల గుండా మాత్రమే దిగువకు వరదనీరు విడుల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పై భాగం ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టటడంతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో బుధవారం అధికారులు 8 క్రస్ట్‌గేట్లను మూసేశారు. బుధవారం సాయంత్ర 4గంటల సమయానికి అధికారులు సేకరించిన సమాచారం మేరకు ప్రస్తుతం జలాశయం ఎత్తు 1624.78 అడుగులకు నీటి మట్టం చేరుకోగా, జలాశయానికి 46,270 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. వివిధ సాగునీటి కాలువలకు వదులుతుండగా, జలాశయం 13క్రస్ట్‌గేట్లలో ఒక్కో గేటు- 2.5అడుగులు చొప్పు ఎత్తి 36,699 క్యూసెసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు- బోర్డు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 75.77 టీ-ఎంసీల నీరు నిలువ ఉంచి. గత ఏడాది ఇదే సమయానికి 51,955 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరుతుండగా 23.079 టిఎంసి

# అటవీ సంపదను పునరుద్ధరణకు చర్యలు

ఆదిలాబాద్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు తెలిపారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్టుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని అటవీ అధికారులు తెలిపారు. పర్యావరణ హితం కోసం మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఈసారి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు.

# సకాలంలో రుణాలు అందక తంటాలు

కరీంనగర్,పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్‌క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతులుంటారు కాబట్టి వీరిరికూడా వచ్చే వానాకాలం పంటరుణాన్ని దరిచేర్చేలా చర్యలుండాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, ధీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపులైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

# వాటర్ బాంబ్..

న్యూఢిల్లీ,భారత్-చైనా సరిహద్దులో చైనా ప్రతిపాదించిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుపై అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును ఆయన 'వాటర్ బాంబ్'గా అభివర్ణించారు, ఇది దేశ భద్రతకు, లక్షలాది మంది జీవనాధారమైన నదీ వ్యవస్థకు తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈ ప్రాజెక్టుపై తన భయాన్ని వ్యక్తం చేస్తూ, ఇది సైనిక ముప్పుకు మించినదిగా అభివర్ణించారు. "చైనాపై ఎటువంటి విశ్వాసం పెట్టలేం. వారు ఏ సమయంలో ఏ చర్యలు తీసుకుంటారో తెలియదు. జలవిద్యుత్ ప్రాజెక్టు పేరుతో వారు భారీ డ్యామ్ నిర్మిస్తున్నారు. కానీ ఇది నీటిని నిల్వ చేయడానికే కాదు.. అవసరమైతే నీటిని ఆయుధంగా మార్చే ప్రయత్నం కావచ్చు. ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే సియాంగ్ ప్రాంతమంతా సమూలంగా నాశనమవుతుంది" అని ముఖ్యమంత్రి ఖండూ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం ఆందోళనను మరింత పెంచుతోంది.

– ప్రాజెక్టు ముప్పులు.. భారత దేశానికి ప్రమాదాలు

చైనా నిర్మించ తలపెట్టిన ఈ భారీ డ్యామ్ నిర్మాణ వ్యయం సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల భారత్ ఎదుర్కోబోయే ప్రధాన ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవి కాలంలో బ్రహ్మపుత్ర నదికి నీటి ప్రవాహం తగ్గిపోవచ్చు. ఇది దిగువ ప్రాంతాల్లోని వ్యవసాయం, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాకాలంలో చైనా ఒకేసారి

# కల్తీ కల్లు కాటు.. శ్రమజీవులే బలి!




హైదరాబాద్,తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేసేవారు కోట్లు ఆర్జిస్తుండగా.. తాగిన వాళ్లకు చావే గతి అవుతున్నది. కల్తీ కల్లు మాఫియా రాజకీయ పార్టీల్లో ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారులను మచ్చిక చేసుకుని తమ దందా నిరాటకంగా కొనసాగిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కల్తీ కల్లు సమస్య మరోసారి చర్చల్లోకి వచ్చింది. కల్తీ కల్లు.. తాగిన వారి ప్రాణాలు హరిస్తున్నది. మహబూబ్ నగర్, నల్లగొండ, కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో వరుసగా చోటు చేసుకున్న కల్తీ కల్లు మరణాలు.. దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. కల్తీ కల్లు కారణంగా ఎందరో మానసిక రోగులుగా మారుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు కల్తీ కల్లు మాఫియాను నియంత్రించడంలో విఫలమవుతున్నది. ఈ కల్తీ కల్లు కాటుకు కష్టజీవులే ప్రధానంగా బలవుతున్నారు. తాజాగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి నలుగురు చనిపోవడం, మరో 22 మంది హాస్పటళ్ల పాలవడంతో కల్తీ కల్లు వ్యవహారం మళ్లీ చర్చలోకి వచ్చింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కల్తీ కల్లును నివారించే క్రమంలో కల్లు కాంపౌండ్లను నిషేధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్లుగీత కార్మికుల మేలు కోసం కేసీఆర్ ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా వాటిని కొనసాగిస్తున్నది. అయితే.. కల్లుడిపోలు, కాంపౌండ్లకు సరఫరా అవుతున్న కల్లులో నాణ్యత ప్రమాణాలపై సరైన నిఘా.. తనిఖీలు కొరవడటంతో కల్తీకల్లు మాఫియా రెచ్చిపోతున్నదనే అభిప్రాయాలు ఉన్నాయి. కల్తీ కల్లును అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ మాముళ్ల మత్తులో జోగుతుండటంతో పట్టణాలు, గ్రామాల్లో కల్తీ కల్లు విచ్చలవిడిగా ప్రవహిస్తూ శ్రమజీవుల ప్రాణాలను హరించి వేస్తున్నదని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నీడలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, కల్లుకు అలవాటు పడిన ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఆరోగ్యకరమైనదిగా చెప్పే కల్లు పేరిట కాసులకు కక్కుర్తిపడి కాలకూట విషాన్ని పేదల శరీరాల్లోకి నింపుతున్నారు. గ్రామాల్లోనే కాదు.. నగర ప్రాంతాల్లో సైతం కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నా ఎక్సైజ్‌శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కల్తీ కల్లు కేసుల్లో ఎక్సైజ్, పోలీసు శాఖల మధ్య సమన్వయం కూడా సమస్యగా తయారైందని అంటున్నారు. క్లోరోహైడ్రేట్‌గా తేలితేనే తమ పాత్ర ఉంటుందని ఆబ్కారీ శాఖ చెబుతున్నది. మిగిలిన మత్తు పదార్థాలతో తమకు సంబంధం లేదని, అదంతా పోలీసులే చూసుకుంటారని వదిలేస్తున్నారని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

కల్తీ కాటుకు వరుస మరణాలు

ఈ ఏడాది ఏప్రిల్లో కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు తాగి ఏకంగా 58 మంది అస్వస్థతకు గురయ్యారు. నస్రుల్లా బాద్ మండలం అంకోల్, అంకోల్ తండా, దుర్కి, బీర్కూర్ దామరంచ గ్రామాల్లో కల్తీ కల్లు తాగిన బాధితులు అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ కల్లు ప్రభావంతో మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తుం డటంతో వారిని వెంటనే హాస్పిటల్కు తరలించారు. గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో కుస్తీ పోటీల ఉత్సవాల్లో కల్లు తాగిన 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురు తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. ఈ ఘటనలపై అప్పటి సబ్ కలెక్టర్ కిరణ్మయి విచారణ జరిపి కల్లు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత షరా మామూలే అన్నట్టు పరిస్థితి కొనసాగుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 ఆక్టోబర్‌లో మహబూబ్ నగర్ జిల్లాలోని బల్మూర్ మండల పరిధిలోని కొండనాగులపల్లి గ్రామంలో కల్తీ కల్లు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. అంతకుముందు భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామం అంబేద్కర్‌నగర్‌కు చెందిన పోస్టల్‌శాఖలో ఏబీపీఎం ఉద్యోగి విష్ణుప్రకాష్.. కల్తీ కల్లు తాగి పిచ్చి లేసి ఐసీయూలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 2024 డిసెంబర్లో నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో కల్తీ కల్లు తాగిన ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు.


కాదేది కల్తీకి అనర్హం

స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో తాటి.. ఈత చెట్ల నుంచి వచ్చే కల్లు తాగుతున్నామన్న భావన క్రమంగా పట్టణాలే కాదు.. పల్లెల్లోనూ మామమవుతున్నది. చెట్టు కాడికి వెళ్లి కల్లు తాగినా కూడా అక్కడ పోసే కల్లు స్వచ్ఛమైనదో కాదోననే సందేహీ పట్టి పీడిస్తూ ఉంటుందని గ్రామీణులు వాపోతున్నారు. అలాంటిది.. పట్టణాల్లో కల్లు కంపౌండ్లలో దొరికే కల్లు నాణ్యతపై నమ్మకం నేతి బీరకాయలో నెయ్యి సామెత వంటిదేనని అంటున్నారు. గ్రామాల నుంచి కల్లు సేకరించి సీసాల్లో నింపి అబ్కారీ అనుమతులతో కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తుంటారు. ఇక్కడ లభించే కల్లు స్వచ్ఛమైనదేననే భావనతోనే శ్రమజీవులు తమ ఒంటి కష్టం మర్చిపోయేందుకు కల్లును ఆశ్రయిస్తూ ఉంటారు. అటువంటి కష్టజీవులనే లక్ష్యంగా చేసుకుని కల్తీ మాఫియా మత్తు పదార్థాలు కలిపిన కల్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కసారి రసాయనాలు కలిపిన ఈ కల్లు తాగితే దానికే బానిసై పొద్దంతా తాగుతుంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. మత్తుపదార్థాలు కలిపిన కల్లు లభించనివారిలో వింత ప్రవర్తనలు చోటుచేసుకు ంటున్నాయి. కల్తీ కల్లు తాగడం వల్ల నాలిక మొద్దు బారడం, కాళ్లు, చేతులు వంకర్లు పోవడంతోపాటు వింతగా ప్రవర్తిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలు తనిఖీ చేయాలి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. కానీ, ఎక్కడా నమూనాల ఫలితాలను బయటకు వెల్లడించడం లేదన్న విమర్శలున్నాయి. కల్తీ కల్లు అస్వస్థత ఘటనలు బయటపడినప్పుడే హడావుడి చేసి మళ్లీ వ్యాపారులకు అనుమతులిస్తున్నారనే వాదనలు బలంగానే ఉన్నాయి.

అమ్మినోడికి కోట్ల ఆదాయం.. తాగినోడికి సమాధి

రియల్ ఎస్టేట్‌తోపాటు సాగు భూమి విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో సహజ సిద్ధమైన చెట్ల కల్లు విక్రయాలు తక్కువయిపోయాయనే అభిప్రాయాలు ఉన్నాయి. తాగే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ఉన్న కల్లులోనే ఆల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రేట్ వంటి మత్తు పదార్థాలను కలిపి కృత్రిమ కల్తీ కల్లు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేసేవారు కోట్లు ఆర్జిస్తుండగా.. తాగిన వాళ్లకు చావే గతి అవుతున్నది. కల్తీ కల్లు మాఫియా రాజకీయ పార్టీల్లో ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారులను మచ్చిక చేసుకుని తమ దందా నిరాటకంగా కొనసాగిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 10 లీటర్ల సహజ సిద్ధమైన కల్లులో పదిరెట్లకు మించి నీళ్లు కలిపి అందులో మోతాదుకు మించి మత్తు పదార్థాన్ని కలుపడం వల్ల కల్లు ప్రియులు రోగాల బారిన పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి ఎక్కువగా కల్తీ కల్లు రసాయనా లు వస్తున్నాయని సమాచారం. కల్తీ కల్లు దందాను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఆడపాదడపా అక్కడక్కడ దాడులు చేసి, ఒకటో, రెండో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో కల్లు డిపోలు, షాపుల్లోనే కాకుండా ఎక్కడ పడితే అక్కడ కల్తీ కల్లును అమ్ముతున్నారని తెలుస్తున్నది. అచ్చంగా కల్లు మాదిరిగానే కనిపించే కృత్రిమ కల్లుకు అలవాటు పడిన వారు స్వచ్ఛమైన కల్లు తాగినా..మత్తు ఎక్కడం లేదని గోల చేస్తుంటారు. మద్యం ధర లు ఎక్కువగా ఉండటంతో పేదలు, రోజువారీ కూలీలు ఈ కల్లు వైపే మొగ్గు చూపుతున్నారు.కానీ..అదే వారికి కొన్ని సందర్భాల్లో శాపంగా పరిణమిస్తున్నది.

# చైనాలో అధికార మార్పిడి తప్పదా



బీజింగ్,చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు-పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉంది. యువతకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఆర్థిక సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనడంలో జిన్‌పింగ్ విఫలమయ్యారనే విమర్శలు పార్టీలోనే పెరుగుతున్నాయి. జిన్‌పింగ్ అధికారాన్నంతటినీ కేంద్రీకృతం చేశారు. తన గుప్పిట్లో ఉంచుకున్నారు. ఇది పార్టీలో అసమ్మతి రాజేసింది. మాజీ నాయకులు, సీనియర్ పార్టీ సభ్యులు జిన్‌పింగ్ నిర్ణయాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీలోని వివిధ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడం వల్లే, జిన్‌పింగ్ తలొగ్గి ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చైనాలో అధికార మార్పిడి ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో జరిగే సాధారణ ఎన్నికల పక్రియకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అన్ని ప్రభుత్వ సంస్థలు, సైన్యం, న్యాయవ్యవస్థ, మీడియా... ఇలా అన్నీ పార్టీ నియంత్రణలోనే పనిచేస్తాయి. పార్టీ నాయకుల ఎంపిక, పదవీ విరమణ వంటి నిర్ణయాలు పార్టీలోని అత్యున్నత స్థాయి కమిటీలైన పొలిట్‌బ్యూరో, దాని స్టాండింగ్ కమిటీలే తీసుకుంటాయి. ఒకవేళ జిన్‌పింగ్ వైదొలిగితే ఆయన స్థానంలో ఎవరు బాధ్యతలు తీసుకుంటారనేదానిపై స్పష్టత లేదు. జిన్‌పింగ్ వారసుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నవాళ్లలో ప్రస్తుతం చైనా ప్రధానిగా లీ కియాంగ్ ముందున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడు. లీ కియాంగ్ తో పాటు- డింగ్ జుయెజియాంగ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. చైనాలో అధికార మార్పిడి పక్రియ చాలా రహస్యంగా సాగుతుంది. ఒకవేళ జిన్‌పింగ్ అధికారం నుంచి తప్పుకుంటే, అది చైనా రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

శ్రీకాకుళం, యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# భద్రాద్రి అభివృద్దికి చర్యలు ఏవీ

భద్రాద్రి, యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో మంత్రి తుమ్మల అధికారులతో చర్చించారు. పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రిలాగా కాకాపోయిన కొంతయినా చేసి భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని జాతీయస్థాయిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పంగా ఉందని నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇక్కడ ఏటా శ్రీరామ నవమి, సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయినా ఆలయ అభివృద్ధి ప్రణాళిక మాత్రం ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధిని చేపట్టి భద్రాద్రినిపర్యాటకకేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులుకోరుతున్నారు.

# వైసీపీయే దిక్కా?

విజయవాడ:2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవం తర్వాత ఒక్కొక్కరు మెల్లగా ఆ పార్టీకి దూరమయ్యారు. చిన్నా, పెద్దా చాలామంది నాయకులు జగన్ ని విమర్శించి పక్కకు వెళ్లిపోయారు. అలా వెళ్లిన వారిలో ఇద్దరు కీలక నేతలు విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసులరెడ్డి. ఒకరు జగన్ కి దగ్గరి బంధువు అయితే, మరొకరు ఆత్మబంధువు లాంటివారు. ఇద్దరూ వైసీపీ అధికారంలో ఉ న్నప్పుడు చక్రం తిప్పారు, అధికారం పోగానే వివిధ కారణాలు వెదుక్కుని మరీ జంప్ అయ్యారు. అయితే వీరిద్దరికీ బయట ఉక్కపోతగానే ఉంది. అలాగని నిన్న వెళ్లిపోయి ఈరోజు తిరిగి రావడమంటే మరీ అవమానం. అందుకే ఆలోచిస్తున్నట్టున్నారు. ఇప్పటి వరకు దీన్ని కేవలం పుకారు అనుకున్నా.. రాబోయే రోజుల్లో ఇదే నిజం అయ్యే అవకాశాలను కొట్టిపారేయలేం.

వ్యవ'సాయి'రెడ్డి పరిస్థితి ఏంటి..?

రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి ఏకకాలంలో రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. ఆయన ఎగ్జిట్ ఎవరూ ఊహించనిది. ఎందుకంటే.. వైఎస్ఆర్ తోనూ, జగన్ తోనూ ఆయనకున్న అనుబంధం అలాంటిది. అయితే 2024 ఎన్నికలకు ముందే విజయసాయిరెడ్డికి వైసీపీలో ఎదురుదెబ్బలు తగిలాయి. రాజ్యసభ సభ్యుడిగా హ్యాపీగా ఉన్న ఆయన్ను తీసుకొచ్చి నెల్లూరు ఎంపీగా పోటీ చేయమన్నారు. ఇష్టం లేకపోయినా ఆ బాధ్యత భుజాన వేసుకుని పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఇక పార్టీలో సజ్జల ప్రాబల్యం పెరిగిపోవడం కూడా విజయసాయికి ఇబ్బందిగా మారింది. దీంతో ఆయన కోటరీ అంటూ వ్యాఖ్యలు చేసి బయటకు వెళ్లిపోయారు. ఇతర పార్టీలో చేరతారనే ప్రచారం జరిగినా, తాను వ్యవసాయానికే పరిమితం అవుతానని ఖరాఖండిగా చెప్పారాయన. కానీ ఆ పని కూడా మొదలు పెట్టలేదు. ఆయన ప్రయాణం రాజకీయమేనని తేలిపోయింది. అయితే విజయసాయిరెడ్డికి ఇతర పార్టీల్లో అవకాశం ఉండదు అనే విషయం కూడా తేలిపోయింది. దీంతో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం జరుగుతోంది. జగన్ తో ఆయన కలసి ఉన్న పాత ఫొటోలను కొత్తగా వైరల్ చేస్తున్నారు. మరోవైపు వైసీపీనుంచే సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నా.. ఆ పార్టీలోకి విజయసాయి రీఎంట్రీని మాత్రం కొట్టిపారేయలేం.

బాలినేని దారెటు..?

2024 ఎన్నికల తర్వాత కూటమి విజయం ఈవీఎంల విజయం అంటూ రచ్చ చేశారు బాలినేని శ్రీనివాసులరెడ్డి. కోర్టులో కేసులు కూడా పెట్టారు. అలాంటి బాలినేని రోజుల వ్యవధిలోనే వైసీపీకి గుడ్ బై చెప్పేసి జనసేన కండువా కప్పుకున్నారు. కానీ జనసేనలో ఆయనకు పెద్ద ప్రయారిటీ దక్కలేదు. ఇటు ప్రకాశం జిల్లాలో బాలినేనికి టీడీపీతో పాత గొడవలున్నాయి. అవి కూడా ఇంకా సద్దుమణగలేదు. బాలినేనిని జనసేన నేతగా ఎవరూ గుర్తించడం లేదు. దీంతో ఆయన ఆ పార్టీతో అంటీముట్టనట్టుగానే ఉన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్ ని బాలినేని కలసినా పెద్ద హడావిడి లేదు. ఇలాంటి దశలో బాలినేని తిరిగి వైసీపీ గూటికి చేరతారనే పుకార్లు మొదలయ్యాయి. అంటే ఇక్కడ బాలినేనికి వైసీపీ మినహా వేరే ఆప్షన్ లేదు అనే విషయం తేలిపోయింది.

# మహిళలకు గిఫ్ట్ అందించబోతున్న తెలంగాణ సర్కార్



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ఈ దసరా పండుగ సందర్భంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా చీరలు అందించేందుకు సిద్ధమవుతోంది. గతంలో రద్దు చేసిన బతుకమ్మ చీరల స్కీమ్ స్థానంలో కొత్తగా ఈ చీరల పంపిణీ పథకాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది రెండేసి చీరలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళ్లింది. ఈ స్కీమ్ కోసం ఇప్పటికే రూ. 318 కోట్లు కేటాయించారు. ఇప్పటికే 1.25 కోట్ల చీరల తయారీ పూర్తవగా, మరో 40 లక్షల చీరల తయారీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

చేనేత కార్మికులకు ఉపాధి నాణ్యతకు ప్రాధాన్యం

ఈ పథకం అమలుతో రాష్ట్రంలోని అనేక చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తోంది. గతంలో కేవలం సిరిసిల్ల ప్రాంతానికి పరిమితమై ఉన్న చీరల తయారీ ఇప్పుడు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, హనుమకొండ జిల్లాలకు విస్తరించింది. మొత్తం 11 ప్రాంతాలకు ఆర్డర్లు ఇచ్చారు. దాంతో 10 వేల మందికి ఉపాధి కలిగింది. ఒక్కో కార్మికుడికి నెలకు సుమారు రూ. 25 వేలు వేతనం అందుతోంది. చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్య నిపుణులతో చర్చించి డిజైన్లు రూపొందించి, సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం పొందినట్లు తెలిపారు.

చీరల పంపిణీకి సమాయత్తం దసరా నాటికి అందుబాటులోకి

60 ఏళ్ల లోపు ఉన్న మహిళలకు 6 మీటర్ల చీరలు, 60 ఏళ్లు పైబడిన వారికి 9.5 మీటర్ల చీరలు ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 48 లక్షల %హాం+% మహిళలు, పట్టణాల్లో 17 లక్షల మంది లబ్దిదారులున్నారు. సెప్టెంబర్ చివరి నాటికి అన్ని చీరలు సిద్ధమవుతాయని అధికారులు తెలిపారు. నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 131 పరస్పర సహాయ సంఘాలు, 56 చిన్న పరిశ్రమల యూనిట్లు ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయంటే, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం.

# పేదలకు రేవంత్ సర్కార్ తీపికబురు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించబోతోంది. ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గతంలో దరఖాస్తు చేసిన వేలాది మంది పేద కుటుంబాలు ఈ కొత్త కార్డుల కోసం దశాబ్దం పైగా ఎదురుచూశారు. జనవరి 26న దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి ప్రభుత్వ యంత్రాంగం ఈ కార్యక్రమానికి శ్రమిస్తోంది.

ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులు

ఈసారి జారీ చేయబోయే రేషన్ కార్డులు పూర్తిగా ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన స్మార్ట్ కార్డులు(%బాఝీతీ ఝుతీ౦ం% )గా ఉండబోతున్నాయి. ఇవి ఏటీఎం కార్డు సైజులో ఉంటాయి. ప్రతి కార్డు మీద బార్‌కోడ్, క్యూఆర్ కోడ్‌లు ఉంటాయి. రేషన్ డీలర్లు ఈ కార్డులను స్కాన్ చేసి సరుకులు జారీ చేస్తారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఫోటోతోపాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రాలు కూడా కార్డుపై ఉండనున్నాయి. ముఖ్యంగా ఈ కార్డులు ఆధార్‌తో లింక్ చేయబడి ఉండటంతో అక్రమాలకు అవకాశమే ఉండదని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

రాజకీయ లబ్ధి దృష్టిలో పెట్టుకుని వేగంగా అమలు

రాష్ట్రంలో వచ్చే మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో



రేషన్ కార్డుల పంపిణీ పాలకులకు రాజకీయంగా కూడా కీలకమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రజలలో విమర్శలు వచ్చాయి. అదే కారణంగా ఎన్నికల్లో ఓటమికి కూడా ఇది ఒక ప్రధాన అంశంగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే దృష్టి సారించి, పథకాన్ని వేగవంతం చేసింది. దీంతో పేదల హృదయాల్లో విశ్వాసం పెంచుకునే ప్రయత్నం జరుగుతోంది.

# కొండా ఫ్యామిలీ కావాలా? మేము కావాలా? తేల్చుకోవాల్సింది మీరే!

వరంగల్ : వరంగల్ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, మురళి దంపతులకు, జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేల మధ్య ముసలం.. తెలుగు సీరియల్‌ను తలపిస్తున్నది. రెండు వర్గాల మధ్య పంచాయితీ రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ వద్దకు చేరినప్పటికీ చర్యలు చేపట్టడంలో జాప్యం పట్ల ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వచ్చిన ఎమ్మెల్యేలు.. క్రమశిక్షణ కమిటీని కలిసి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మురళి దంపతులపై తాము ఫిర్యాదు చేసి రోజులు గడుస్తుంటే చర్యలు చేపట్టేందుకు ఇంకెంత కాలమంటూ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తామే తిట్లుపడి తామే ఫిర్యాదు చేస్తే, తమనే కమిటీ ముందు హాజరుకావాలని పిలువడం పట్ల కూడా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసహనం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తారా? లేకుంటే నెలకొన్న సమస్యను సాగదీస్తారా? అంటూ ప్రశ్నించారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఎమ్మెల్యేలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మీరు చేసిన ఫిర్యాదుపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకే పిలిచామని వివరణ ఇచ్చారు. తమను కొండా దంపతులు బహిరంగంగా తిట్టిన విషయాలు అందిరికీ తెలిసినవేనని, దీనిపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొండా ఫ్యామిలీ కావాలో? తాము కావాలో తేల్చుకోవాలని తేల్చిచెప్పారు. తమ నియోజకవర్గాల్లో మంత్రి పేరుతో జోక్యం చేసుకోకుండా నిరోధించాలని కోరారు. తమకు ఫ్రీహ్యాండ్ ఇవ్వాలని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

రెండు గంటలపాటు చర్చ

క్రమశిక్షణ కమిటీ రెండు గంటల పాటు వారి నుంచి వివరాలు సేకరించింది. జిల్లాలో వాస్తవ పరిస్థితి, నియోజకవర్గాల్లో నెలకొన్న ఇబ్బందులు, కొండా దంపతులతో ఉన్న ప్రధాన సమస్య వంటివి ఆరా తీశారని సమాచారం. తాము పార్టీ క్రమశిక్షణకు బద్ధులమై ఉన్నామని ఎమ్మెల్యేలు చెప్పారు. ఈ రోజు క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన వారిలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు ఉన్నారు.

త్వరలో సమస్యకు పరిష్కారంః మల్లు



వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదుపై మల్లు రవి మాట్లాడుతూ ఇరువర్గాల నుంచి పూర్తి వివరాలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే కొండా సురేఖ దంపతులు క్రమశిక్షణ కమిటీకి ముందు ఆరుపేజీల లేఖ, తర్వాత సుదీర్ఘంగా మరో లేఖ అందించి వివరాలు తెలియజేశారు. తాజాగా ఎమ్మెల్యేల వివరణ తీసుకున్నామన్నామని త్వరలో దీనిపై ఫలవంతమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే మరోసారి వివరాలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ పతాకస్థాయికి చేరిన రచ్చ

కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ భర్త మురళి.. వరంగల్‌లో జరిగిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం, రేవూరిలపై తీవ్ర విమర్శలు చేస్తూ పరుషంగా మాట్లాడటంతో జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు రచ్చకెక్కాయి. మంత్రి సురేఖ దంపతులకు, ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. కొండా దంపతుల విమర్శలతో మనస్థాపానికి గురైన ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీకి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ కొండా మురళికి షోకాజ్ నోటీసు జారి చేసింది. రెండు పర్యాయాలు లేఖల ద్వారా కొండా దంపతులు తమ వివరణ ఇచ్చారు. ఈ లేఖలోని అంశాలు బహిర్గతం కావడం, మీడియాతో మాట్లాడటంతో ఇరువర్గాల మధ్య విభేదాలు పతాకస్థాయికి చేరాయి. ఈ స్థితిలో ఎమ్మెల్యేలు తాజాగా తమ ఫిర్యాదుపై వివరణ ఇచ్చారు. ఇలాంటి సమస్యలను సాగదీయడం బాగా అలవాటుపడ్డ కాంగ్రెస్ పార్టీ ఇంకెంత కాలం తీసుకుంటుందోననే చర్చ సాగుతోంది.

# వేమిరెడ్డి మీద వైసీపీ ఆగ్రహం అందుకేనా ?



నెల్లూరు: నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అంగబలం దండీగా ఉన్న వారు. ఆయన భారీ పారిశ్రామికవేత్తగా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. ఆ విధంగా ఆయనకు పొలిటికల్ ఫ్లాట్ ఫారాన్ని ఏర్పాటు చేసి రెడ్ కార్పెట్ పరచించి వైసీపీనే. 2018లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వైసీపీకి ఒక సీటు దక్కింది. అది విజయసాయిరెడ్డి తరువత వైసీపీకి దక్కిన రెండవ రాజ్యసభ సీటు.వైసీపీకి అపుడు ఉన్న బలానికి ఒక్క సీటే లభిస్తూ ఉండేది. ఈ సీటు కోసం ఎందరో ప్రయత్నం చేశారు. సీనియర్ల కన్ను కూడా ఉండేది పైగా వైసీపీ అధికారం రుచి చూడలేదు దాంతో అనేక మంది పెద్దల సభకు వెళ్తే హ్యాపీగా ఆరేళ్ళ పాటు ఉండొచ్చు అనుకున్నారు. కానీ అనూహ్యంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేరు రాజకీయ తెర మీదకు వచ్చింది. అప్పటిదాకా ఆయన జిల్లాకే పరిమితం అయి పారిశ్రామిక వర్గంలోనే పరిచయం ఉన్న వారు.ఆయనను రాజకీయంగా ముందుకు తీసుకురావడం ద్వారా అంగబలం అర్ధబలం పార్టీకి విపక్షంలో ఉన్న వేళ సమకూరుతాయన్న ఆలోచన కూడా ఉంది. దానికి తగినట్లుగా వేమిరెడ్డి వైసీపీకి నెల్లూరు జిల్లాలో ఎంతగానో ఉపయోగపడ్డారు. ఇలా పరస్పర అవగాహనతో ఆరేళ్ళ పాటు ఈ బంధం సాగింది. అయితే రాజకీయం రుచి చూశాక మరింతగా ఎదగాలని ఎవరికైనా ఉంటుంది.నెల్లూరు జిల్లాలో వైసీపీ అధ్యక్షుడిగా ఉంటూ జిల్లా మీద పట్టు సాధించిన వేమిరెడ్డి 2024లో లోక్ సభకు పోటీ చేయాలని అనుకున్నారు. అంతే కాదు తన సతీమణి ప్రశాంతి రెడ్డికి అసెంబ్లీ టికెట్ కూడా తీసుకోవాలని భావించారు. అదే విధంగా పది దాకా ఉన్న అసెంబ్లీ సీట్లలో కొన్ని సీట్లు తన వర్గం వారికి ఇప్పించుకోవాలని ఆలోచించారని అంటారు.అయితే వైసీపీ అధినాయకత్వం మాత్రం ప్రశాంతి రెడ్డికి మాత్రమే ఎంపీ టికెట్ ఇచ్చి మిగిలిన వాటిని పక్కన పెట్టిందని టాక్ నడచింది. దాంతో ఆయనకు టీడీపీ నుంచి బంపర్ ఆఫర్ రావడంతో ఆ వైపు మళ్ళారు. రాజకీయాల్లో ఇవన్నీ మామూలే. కానీ ఎన్నికల యుద్ధ క్షేత్రంలో ఉండగా వేమిరెడ్డి తీసుకున్న నిర్ణయం నెల్లూరు జిల్లాలో వైసీపీకి ఆశనిపాతంగా మారింది.మొత్తానికి మొత్తం సీట్లను ఆ పార్టీ కోల్పోయేలాగా పరిణామాలు సంభవించాయి. దాంతో పాటు బలమున్న నేతలు అంతా ఓటమి బాట పట్టారు. అంగబలం అర్ధబలం సంపూర్ణంగా ఉన్న వేమిరెడ్డి టీడీపీకి ఒక ఆయుధంగా మారారు. నిజానికి ఆయన టీడీపీ వైపు వెళ్ళకపోతే ఆ పార్టీకి గట్టి ఎంపీ అభ్యర్థి కూడా దొరకడం కొంత ఇబ్బంది అయ్యేది కానీ వైసీపీ అధినాయకత్వం జిల్లాలో ఉన్న కొందరు నేతల వైపు ఉంటూ కోరి మరీ వేమిరెడ్డిని దూరం చేసుకునందని ఒక వెర్షన్ గా చెబుతారు.మరో వైపు చూస్తే గెలిచే పార్టీగా టీడీపీని భావించి వేమిరెడ్డి ఆ వైపు వెళ్ళారని అంటారు. ఏది ఏమైనా నెల్లూరు జిల్లాలో ఓడలు బళ్ళు అయ్యాయి. వైసీపీకి కంచుకోట ఒక్కసారిగా బద్దలు అయిపోయింది. ఈ పరిణామం వల్లనే వైసీపీ బొత్తిగా ప్రతిపక్ష స్థానానికి కూడా దక్కకుండా దుస్థితి ఏర్పడింది.ఇక వేమిరెడ్డి వైసీపీలో ఉన్నపుడు ఆయన అంగబలం అర్ధబలానికి తూగలేమని భావించిన కొందరు నాయకులు కావాలనే ఆయనకు పొగ పెట్టారని అంటున్నారు. ఏది ఏమైనా నెల్లూరులో ఫ్యాన్ స్విచాఫ్ చేసిన వేమిరెడ్డి మీద జిల్లాలో ఆ పార్టీ నేతలకు ఉండాల్సిన కోపం కంటే ఎక్కువగానే ఉంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే వేమిరెడ్డి టీడీపీ కూటమిలో చేరినా ఏమంత సౌకర్యంగా లేరని ఆ మధ్యన ప్రచారం సాగింది. జిల్లా పరిషత్ మీటింగ్ కి తనను పిలవలేదని అలిగి ఆయన కారెక్కి వెళ్ళిన వైనం కూడా అంతా చూశారని చెబుతారు.ఇక ఆయన సతీమణికి మంత్రి పదవి దక్కుతుందని ఆశించినా దక్కలేదు అన్నది కూడా ఉందని చెబుతారు. జిల్లాలో తమ మాట పెద్దగా చెల్లడం లేదన్న అసంతృప్తి ఉదని అంటారు. ఈ పరిణామాల నేపథ్యంలో వేమిరెడ్డి వైసీపీ వైపు మళ్ళీ చూస్తున్నారు అన్న ప్రచారం కూడా ఆ మధ్యన సాగింది. అయితే ఇపుడు కాకపోయినా ఎన్నికల ముందు ఆయన వెళ్తారని కూడా పుకార్లు అలాగే వినిపిస్తూ వస్తున్నాయి.అయితే వేమిరెడ్డి మళ్ళీ వైసీపీలోకి వస్తే తమ ఆధిపత్యానికి ఇబ్బంది అవుతుందని భావించే కొంతమంది ఆయనకు వైసీపీకి మధ్య శాశ్వతంగా అడ్డుకట్ట కట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఇటీవల పరిణామాలు అని అంటున్నారు. మొత్తం మీద అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి ఇబ్బందులు పడుతున్న వేమిరెడ్డి కుటుంబం కూటమితో సాఫీగా ఉంటే పాలిటిక్స్ లో ప్రయాణం చేయడం లేకపోతే శాశ్వతంగా తప్పుకోవడమే మార్గంగా ఇపుడు కనిపిస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి రాజకీయాల్లో ఏమి జరుగుతుందో.

# కేసీఆర్ ప్రత్యర్థిగా మైనంపల్లి?.. ఆసక్తికరంగా సిద్ధిపేట జిల్లా రాజకీయాలు



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీకి అత్యంత పట్టున్న సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సొంత జిల్లా కావడం, మరో బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కూడా ఉండటం జిల్లాలో కాంగ్రెస్ పట్టు బిగించేలా గట్టి స్కెచ్ వేస్తోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కారు జోరు చూపించిన ఈ జిల్లాలో పార్లమెంటు ఎన్నికల నాటికి కమలం వికసించింది. అయితే ఇప్పుడు ఆ రెండుపార్టీలకు చెక్ చెప్పి స్థానిక ఎన్నికల్లో హవా చాటుకోవాలని చూస్తోంది హస్తం పార్టీ. ఇందుకోసం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును రంగంలోకి దింపింది.సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ కీలక నేతలు ఇద్దరు ఉండటంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, హరీశ్ రావు నియోజకవర్గం సిద్దిపేట బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే హనుమంతరావుకు అప్పగించారని అంటున్నారు. టీడీపీలో ఉన్నప్పటి నుంచి కేసీఆర్ బలాబలాలుపై హనుమంతరావుకు అవగాహన ఉన్నందున ఆయన అయితే గులాబీ బాసుకు చెక్ పెట్టొచ్చని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ముందుగా గజ్వేల్ లో పార్టీని పర్యవేక్షించాలని మైనంపల్లికి సీఎం బాధ్యతలు అప్పగించినట్లు చెబుతున్నారు. అయితే తనకు గజ్వేల్ తోపాటు సిద్దిపేట బాధ్యతలు కూడా ఇవ్వాలని మైనంపల్ల కోరారని అంటున్నారు.గత ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేసి ఓడిన మైనంపల్లి ఈ సారి సిద్దిపేట లేదా గజ్వేల్ నుంచి పోటీ చేయాలని ఆశిస్తున్నారని అంటున్నారు. ఆయన సొంత నియోజకవర్గం మెదక్ లో ప్రస్తుతం హనుమంతరావు కుమారుడు రోహిత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆ స్థానాన్ని కొడుక్కి అప్పగించి తాను మరో నియోజకవర్గం చూసుకోవాలని ఆయన ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మల్కాజిగిరి రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గం కావడం, సిటీ పరిధిలో ఉండటంతో తన సొంత ప్రాంతంలోనే రాజకీయం చేయాలనే ఆలోచనతో మైనంపల్లి గజ్వేల్, సిద్దిపేట వైపు చూస్తున్నట్లు చెబుతున్నారు.ఇదే సమయంలో కలిసొచ్చే కాలానికి అనుకున్నట్లు బలమైన ప్రత్యర్థులు అయిన కేసీఆర్, హరీశ్ రావులను టార్గెట్ చేయాలంటే ఆర్థికంగా బలవంతుడైన మైనంపల్లి వంటివారు కరెక్టు అన్న ఆలోచనలో కాంగ్రెస్ ఈ ప్రతిపాదనపై సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గజ్వేల్ లో ప్రస్తుతం ఇన్చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సిరెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఢీకొట్టడంలో విఫలమవడం, ఆయనకు పార్టీలో మరో వర్గం నుంచి వ్యతిరేకత ఉన్న కారణంగా గజ్వేల్ బరిలో మైనంపల్లిని దించాలనే ప్రతిపాదనపై పీసీసీ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతున్నట్లు చెబుతున్నారు.

# రంగరాయ మెడికల్ కళశాలలో లైంగిక వేధింపులు

కాకినాడ:కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో విద్యార్థినులపై కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చి కలకలం రేపింది. బీఎస్సీ , డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సులు చదువుతున్న విద్యార్థినులపై ల్యాబ్ సహాయకుడు, మరో ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నారని బాధిత విద్యార్థినులు కొందరు ఫ్యాకల్టీ వద్ద చెప్పుకుని విలపించారు. ఇదే విషయమై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు అందడంతో ఆయన తీవ్రంగా పరిగణించి అంతర్గత కమిటీ ద్వారా విచారణ చేయించారు. మైక్రో బయాలజీ, పాథాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాల్లో కొందరు సిబ్బంది తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు 50 మంది విద్యార్థినులు కమిటీ ముందు చెప్పారు. ఈ కమిటీ నివేదిక సమర్పించాల్సి ఉంది.విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సిబ్బందిలో ఇద్దరు బెదిరించినట్టు కూడా తెలిసింది. తాను శాశ్వత ఉద్యోగినని, తనను ఎవరూ ఏమీ చేయలేరని ల్యాబ్ సహాయకుడు ఒకరు విద్యార్థినులను బెదిరించినట్టు కూడా సమాచారం. అంతేకాదు, కొందరు ల్యాబ్ అసిస్టెంట్లు



విధులకు మద్యం తాగి వస్తున్నారని కూడా కమిటీకి తెలిపారు. అయితే, తాము ఎవరిపట్లా అసభ్యంగా ప్రవర్తించలేదని విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది చెప్పినట్టు తెలిసింది.వేధింపుల వ్యవహారం నిజమేనని, విచారణ జరిపించామని,ఇందుకు సంబంధించిన నివేదిక రావాల్సి ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ చెప్పారు.ఆరోపణలు నిజమని తేలితే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ఉధృతి

శ్రీశైలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో జలాయశయంలోకి భారీగా వరద నీటి ప్రవాహం వస్తోంది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను తెరచి.. నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 1,48,696 క్యూసెక్కులుగా ఉండగా.. ఔట్ ఫ్లో 1,48, 734 క్యూసెక్కులుగా ఉంది. ఇక, జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉండగా.. ప్రస్తుత నీటిమట్టం 882.80 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. అలాగే, తుంగభద్ర డ్యామ్ కు కూడా వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో అధికారులు డ్యామ్ 12 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్ లోకి ఇన్ ఫ్లో



40,082 క్యూసెక్కులుగా.. అవుట్ ఫ్లో 40,657 క్యూ సెక్కులుగా ఉంది.

# ఫస్ట్ ఎంపీటీసీ, తర్వాత సర్పంచ్.. స్థానిక ఎన్నికలపై రేవంత్ సర్కార్ వ్యూహం ఇదే!



హైదరాబాద్,స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంతో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మొదట పరిషత్ ఎన్నికలే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ZPTC, MPTC ఎన్నిలక తర్వాతే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం లభించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంతో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మొదట పరిషత్ ఎన్నికలే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ZPTC, MPTC ఎన్నిలక తర్వాతే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. ఈ రెండు ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురానుంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జూలై చివరిలోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రిజర్వేషన్ ప్రక్రియ వేగం చేయనుంది.పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్సును గవర్నర్ విడుదల చేసిన వెంటనే పరిషత్, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేయనుంది. పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా ఖరారు చేయాలన్న నిర్ణయం జరిగింది. ఆర్డినెన్స్ విడుదల కాగానే పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్లను ఖరారు చేసి.. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అప్పగించనుంది. వాటి ఆధారంగా ఎన్నికల కమిమిషన్ ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. ఆ ప్రక్రియ ముగియగానే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించనుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com